


గోలీసోడాల తోపుడు బండిని రోడ్డు అప్ ఎక్కించేందుకు శక్తినంతా కూడదీసుకొంటున్నాడు నరసిమ్మ. బంజారాహిల్స్ రోడ్డు నంబరు మూడుకి, ఇటూ రోడ్డు నంబరు ఒకటినుండి వెళ్ళాలంటే కొండనెక్కినంతగా ఆయాస పడాల్సి ఉంటుంది.

చేతి నరాలు, మోకాలి దగ్గిరి పిక్కలూ బిగుసుకొంటుంటే, ఊపిరి బిగబట్టి బండిని మీదికి నెడుతున్నాడు నరసిమ్మ. కాళ్ళను బలంగా భూమిమీద ఆన్చి, గుండెను బండికి ఎదురొడ్డి పట్టుసడలక, పట్టుదలగా నెడుతున్నాడు. అంగుళమంగళంగా బండిని మీదికి చేరవేస్తున్నాడు.

సోడా సీసాలన్నీ ఇటువేపుకు పొడుచుకొచ్చినట్టుగా ఏటవాలుగా నిలిచి ఉన్నాయి.

ఉదయం పదిగంటలయింది. ఆ వేళకే ఎండ మండిపోతోంది. చెమటలు పడుతున్నాడు నరసిమ్మ. పిడికిలిగట్టిన చేతుల్లోంచి చెమట బొట్టుబొట్టుగా కారుతోంది.

వెనుకనుంచి లారీ ఏదో వేగంగా తోసుకురావడంతో బండిని ఆ వేపుకి మళ్ళించాడు. అంతే! పట్టుసడలి, రెండడుగుల దిగువకి జారింది బండి. మరింతగా క్రిందికి జారక అతి ప్రయత్నంమీద ఆపగలిగాడు. లేకుంటే కథ మళ్ళీ మొదటికి వచ్చేది!

పారిపోయిన లారీ డ్రైవర్ని కోపంగా తిట్టుకొన్నాడు నరసిమ్మ. తిట్టేందుకు గమ్మత్తయిన బూతుమ వాడడు. చిన్న సైకిల్‌వాలా నవ్వి, తొక్కుకొని పోతోంటే—

"చూడండి సార్! ఆ నా కొడుకు దురుసు" అంటూ గోడునంతా చెప్పుకో సాగాడు. వెనుతిరిగి చూడలేదు సైకిల్‌వాలా. అప్‌ను ఎక్కించే ప్రయత్నంలో బిర్రబిగుసుకొని సైకిల్ని తొక్కుతున్నాడతను.

**సోడాసీసాలు - 4**

ఆ మనిషి తన మాటలు వినడన్న సంగతి నరసిమ్మకి తెలుసు। తెలిసినా అలా చెప్పుకోగలగడం, ఒదార్పును ఆశించడమన్నది వాడి తరగతి జనానికి అలవాటు।

ఎలాగయితేనేం బండిని అప్ దాటించేశాడు నరసిమ్మ. ఇక ముందున్నదంతా డౌన్। ఇక్కడ కూడ ప్రయాస తప్పదు వాడికి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా బండి దడదడలాడుతు ముందుకు జారిపోతుంది. అందుకని పట్టిపట్టి నడుస్తున్నాడు.

పదడుగుల దూరంలో ఉంది హిందూ స్మశానవాటిక। వాడు అక్కడికి చేరుకోగలగాలి. అదే వాడి వ్యాపారం స్థలం। అక్కడే వాడు సోడాలను విక్రయించేది.

స్మశానవాటిక ముఖద్వారాన్నానుకొని ఉన్న గోడకి బండిని దన్నుచేసి నిలుపుతాడు. జతగా వాడూ నిలుచుంటాడు.

ఎండకి ఎండుతు, చెమటకి తడిసిపోతు, తడి గోనెపట్టాను సీసాలపై పరుస్తు, ఉదయం నుండి సాయంత్రంవరకు అక్కడే నిలుస్తాడు నరసిమ్మ. ఎక్కువగా వాడి కేరాఫ్ అడ్రసు అదే।

నరసిమ్మకి ముప్పైఏళ్ళ వయసుంది. వాడికి పెళ్ళికాలేదు. కాని పెళ్ళాం ఉంది. వాడికి పిల్లల్లేరు. కాని వాడితో కలిసి పారిపోయొచ్చిన పెళ్ళానికి ఇద్దరు పిల్లలున్నారు. వాడిదీ వూరు, హైదరాబాదు కాదు. వాడిది విశాఖపట్నం।

స్మశానం దగ్గరకి చేరుకొన్నాడు నరసిమ్మ. బండిని, అక్కడి గోడకి దన్నుచేసి నిలిపి, ఊపిరి పీల్చుకొన్నాడు. స్మశానంలోకి తొంగి చూశాడు. అక్కడదంతా ప్రశాంతంగా ఉంది. నిశ్శబ్దంగా ఉంది. శవాలేవీ దహనమవడం లేదు. దహన సంస్కారాలు చూసేందుకు వచ్చే జనాలెవరు లేరు।

"టైం కాలేదింకా" అనుకొన్నాడు.

బండిలోని సోడా సీసాలను మరోసారి లెక్కించాడు. సరిగ్గా వంద సీసాలున్నాయి. తక్కువేమీ లేవు. పది సీసాల వంతున క్రింది వరుసలో ఎనభై సీసాలు, మీదన ఇరవై సీసాలు ఉన్నాయి. తడిపి, తీసుకొచ్చిన గోనెపట్టాను వాటిమీద పరిచాడు.

సోడాను ముప్పై అయిదు పైసల వంతున అందజేస్తాడు షావుకారు. నలభై పైసలకు అమ్ముకోమంటాడు. అంటే సీసామీద అయిదు పైసలు లాభం

నరసిమ్మకి. వంద సీసాలూ అమ్ముడయితే అయిదురూపాయలు చేతిన పడతాయి. ఆ అయిదురూపాయల్తో ఇంటి నలుగురూ తినాలి!

వ్యాపారాన్ని ప్రారంభించిన కొత్తలో సోడా బండిని తోసుకొంటూ కాలనీలన్నీ తిరిగేవాడు నరసిమ్మ. "సోడా! గోళీసోడా" అని అరిచేవాడు. సాయంత్రమయ్యేసరికి కాళ్ళపీకులు, అలుపూ తప్ప సగం సీసాలు కూడ అమ్ముడయ్యేవి కావు. ఇది సరికాదనుకొని, మార్కెట్టు వీధులగుండా బండిని తిప్పేవాడు. అప్పుడూ అంతే! టాంక్ బండ్ మీదికి నడిచాడు కొద్దిరోజులు. అక్కడికి వచ్చేవారంతా ఐస్ క్రీములు, కూల్ డ్రింక్స్ తాగేవారుగాని, సోడా ఊసెత్తేవారు లేకపోయారు. ఆ స్థలం అనువయింది కాదనుకొని, థియెటర్ల ముందుకి వెళ్ళాడు. ఆసరికే అక్కడగల సోడాల బళ్ళదారులు నరసిమ్మను ఘెరావ్ జేసి, రాస్తారోకో ఉద్యమాన్ని ప్రారంభించారు. తప్పింది కాదు. వెను తిరిగొచ్చేశాడు. వస్తుండగా పంజాగుట్ట సర్కిల్ దగ్గర- శవాన్ని, స్మశానానికి తీసుకెళ్ళ ఊరేగింపు తారసపడింది. ఊరేగింపులో వందమందికి పైగా పాల్గొను న్నారు. బేరం సాగుతుందనిపించి, వాళ్ళను అనుసరించాడు నరసిమ్మ. స్మశాన వాటికకి చేరాడు. శవదహనం ప్రారంభమయ్యేసరికి సీసాలన్నీ అమ్ముడయి పోయాయి. అరగంటలో అయిదురూపాయల లాభాన్ని కళ్ళజూశాడు. నాటినుంచి 'వ్యాపారానికి తగిన స్థలం' అనిపించి, స్మశానంతో లింక్ పెట్టుకొన్నాడు నరసిమ్మ.

హైక్లాసు శవాలతో తరలొచ్చేవారు సోడాలను తాగరు! మిడిల్‌క్లాసు మొరాలిటీగాళ్ళు కూడా తాగరు! తాగేది లోయర్‌క్లాసు జనాలే! ఆ శవాలకోసమే గోతి క్రింద నక్కలా వేయి కళ్ళతో చూస్తాడు నరసిమ్మ.

రోజుకి రెండు లేదా మూడు శవాలు వస్తాయి స్మశానానికి. వచ్చిన శవాలన్నీ లోయర్‌క్లాసువి కావాలని ఆశించడంలో నరసిమ్మను తప్పు పట్టలేం! ఊరేగింపు డప్పులు వినవస్తే, వాడి క్లాసుకి చెందిన శవం వస్తుందని ఆనంద పడతాడు. మౌనంగా నడిచొచ్చే ఊరేగింపును చూస్తే మండిపడతాడు.

అదృష్టం కలిసొస్తే ఆ రోజంతా వాడు ఆశించిన శవాలే వస్తాయి. దురదృష్టం పెన్నాడితే హైక్లాసు, మిడిల్‌క్లాసు శవాలొచ్చి వాడి పొట్టను దెబ్బ తీస్తాయి. అందుకని నరసిమ్మ, రోజూ లోయర్‌క్లాసు శవాలే తరలి రావాలని వేనవేల దేవుళ్ళకు మొక్కుకొంటాడు. కన్పించని దేవునికి ఓ సోడాను

నైవేద్యంగా అర్పించి, దానిని స్మశానం ముంగిట ధారపోస్తాడు. అయిదు పైసలు నష్టం! అయినా వాడికందులో కష్టం లేదనిపిస్తుంది.

ఉదయం పదకొండు గంటలయింది. సూర్యుడు నిప్పు పువ్వులా వెలుగుతూ, నిప్పు పుప్పొడిని ఎండ రూపేణా జారవిడుస్తున్నాడు.

ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొంటూ—

"కొంపదీసి ఈ రోజు ఎవరూ పోలేదా" అనుకొన్నాడు నరసిమ్మ. ఆ ఆలోచన వాడిని నిలువునా కుదిపేసింది. క్షణంలో సగం పేప బ్రతుకు భయాన్ని కలుగజేసింది. సాటి మనిషిగా కోరరాని కోరికే! కాని వాడి మనుగడకది అవసరం!

అవ్ను ఎక్కడో పది పదిహేనుమంది గుంపుగా రావడం కన్పించింది నరసిమ్మకి. వాళ్ళంతా మౌనంగా రోదిస్తు నడిచొస్తున్నారు. అర్థమయింది వాడికి. కలిసిరాని బేరం అనుకొని...

"ఛీఛీ వెధవ బోణీ" అనుకొన్నాడు.

ఎవరో బ్రాహ్మణోత్తముడు పరమపదించినట్టున్నాడు. పరువుగా పాడె కదిలివచ్చి స్మశానంలోనికి దారితీసింది. తతంగం సిద్ధమవుతోందక్కడ!

చితికి నిప్పంటుకొంది. నలుగురయిదుగురు పెద్దపెట్టున ఏడవడం వినిపించి నరసిమ్మ—

"బాగా ఏడవండి! గొంతులెండిపోయేలా ఏడవండి! దాహం వేసేలా ఏడవండి! సోడా నలభై పైసలు మాత్రమే అనుకొన్నాడు స్వగతంగా.

ఇంతలో డప్పులు, ఈలలు, నినాదాలూ వినవచ్చాయి. పేరెవరిదో పలుకుతూ "అమర్ హై" అన్న అరుపులు వినరావచ్చాయి. నరసిమ్మ ఆనంద పడ్డాడు. గబగబా నాలుగయిదు అడుగులు ముందుకువేసి ఊరేగింపుకి ఎదురు వెళ్ళాడు. పెద్ద ఊరేగింపే! జనాన్ని ఇట్టే చూసి అంచనా గట్టేశాడు నరసిమ్మ. అయిదారువందల మంది ఉంటారనిపించింది. 'పెద్ద బేరం' అనుకొన్నాడు. సరుకంతా అయినాక అగమేఘాలమీద వెళ్ళి మళ్ళీ సరుకును డంప్ చేయాలనుకొన్నాడు. లాభం పాతిక రూపాయలవరకు గిట్టేదుందని ఆశించాడు.

ఊరేగింపు దగ్గరగా వచ్చేసింది. అంతా స్టూడెంటు కుర్రాళ్ళే! అక్కడక్కడ పోలీసులు, పెద్దలూ ఉన్నారు. ఆ పెద్దలంతా ఆ మధ్య ఎన్నికల్లో ఓడిపోయిన రాజకీయ నాయకులు!

టాపులేని జీపులోంచి శవాన్ని దించారు. దించుతున్నప్పుడు శవాన్ని చూశాడు నరసిమ్మ. లేతముఖం! చనిపోయిన కుర్రాడూ స్టూడెంటేననిపించింది.

ఏదో రాజకీయపార్టీ విద్యార్థిశాఖకి, చనిపోయిన కుర్రాడు ప్రెసిడెంటు! మొన్నరాత్రి ఆ కుర్రాడిపై వేరే రాజకీయ పార్టీ కుర్రాళ్ళు దాడిజేసి చంపేశారు.

—అక్కడనుకొంటున్న మాటల్ని బట్టి నరసిమ్మ అర్థం చేసుకొన్నదది!

దాడిజేసి, ఈ కుర్రాణ్ని చంపేసిన ఆ వేరే రాజకీయ పార్టీలోని ఓ కుర్రాడు కూడ ఆ మొన్ననే చంపబడ్డాడు! ఆ వేరే పార్టీ వాళ్ళు కూడ ఆ కుర్రాణ్నీ ఊరేగింపుగా ఇక్కడికే తీసుకొస్తున్నారు!

మరో విషయం తెలిసి వచ్చింది నరసిమ్మకి. 'చాలాచాలా పెద్ద బేరం' అనుకొన్నాడు. సంబరపడ్డాడు.

బోణీ పడింది. అరిచరిచి ఉన్నారేమో కుర్రాళ్ళు సోడాలు తాగుతున్నారు. నరసిమ్మ లయలులయలుగా గోళీనికొట్టి సోడాలందిస్తున్నాడు. సగానికి సగం సీసాలు అమ్ముడయ్యాయి.

కాసేపట్లోనే ఆ మరో ఊరేగింపూ వచ్చేసింది. అరుపులు, కేకలతో కోలాహలంగా వచ్చేసింది. రావడం రావడంతోనే పెద్దల్ని, పోలీసుల్ని పట్టించుకోక ఫైటింగ్‌కి దిగేసింది. ఇరువర్గాలు హోరాహోరీగా కలబడ్డాయి.

పరిస్థితి తారుమారవడంతో నరసిమ్మకి భయం వేసింది. సాధ్యమయినంతగా అక్కడనుండి తప్పుకోజూశాడు. కాని, వీలుపడడం లేదు. బండిని తోసుకొని ముందుకు వెళ్లాలంటే గుంపును ఛేదించేందుకు అవకాశం కానరావట్లేదు. పైగా ఎటొచ్చి ఏ దెబ్బ ఎవరు కొడతారో, అదెక్కడ పడనుందోనన్న అనుమానం! అందుకని ఉన్నచోటే కాస్తంత మెరుగనిపించి, గోడనానుకొని బిక్కుబిక్కుమని నిల్చున్నాడు.

చేతికి అందివచ్చిన ప్రతిదాన్నీ ఇరువర్గాలు యుద్ధసామగ్రిగా వినియోగిస్తున్నాయి. వారిని అదుపుజేసేందుకు పోలీసులకు, పెద్దలకు సాధ్యం కావట్లేదు!

ఉన్నట్టుండి, గాలిలోనికి ఎగురుతు సోడాసీసా కన్పించింది నరసిమ్మకి. అంతే! ఒకదాని తర్వాత ఒకటిగా, తర్వాత జతలు జతలుగా సీసాలు గాలిలోనికి పరుగులు తీస్తూ కన్పించాయి. రాబందుల్లా, డేగల్లా మీదినుండి క్రిందికి దూకుతు, ప్రేలుతూ కళ్ళని, కాళ్ళనీ పొడుచుకు తింటున్నాయవి!

'ఫట్ ఫట్'న సీసాలు పగులుతుంటే, నోటి క్రింది కూడును ఎవరో లాగేస్తున్నట్టు అన్పించడమేగాక పొట్టమీద పిడిగుద్దు పడ్డట్టుగా విలవిల్లాడాడు నరసిమ్మ. కాలుతున్న శవంలా కుమిలిపోయాడు. **